
ప్రజాశక్తి

మంగళవారం 28 ఫిబ్రవరి 2023 5 విజయనగరం



'స్పందన' ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి-విజయనగరం

స్పందన కార్యక్రమంలో అర్జీలు అందజేస్తున్న వారికి సత్వర న్యాయం చేయాలని ఎస్‌పి దీపిక. పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి 24 ఫిర్యాదులను స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడారు. వాటిని పరిష్కరించేందుకు చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి సిఐ జె.మురళి, ఎస్‌బి సిఐలు సిహెచ్.రుద్రశేఖర్, జి.రాంబాబు, ఎస్ఐలు వాసుదేవ్, ప్రభావతి పాల్గొన్నారు.

కోరెడ్ల రమాప్రభ వైపు ఉద్యోగ, ఉపాధ్యాయుల చూపు

- పిడిఎఫ్ ఉద్యమాలు, ప్రభుత్వ అణచివేత చర్యలే కారణం
- ఎమ్మెల్సీ ఎన్నికల వేళ వాడీవేడి చర్చ



కలెక్టరేట్‌ను ముట్టడించిన ఉపాధ్యాయులు (ఫైల్)

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల చూపు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ రమాప్రభ వైపు కనిపిస్తోంది. మరోవైపు ప్రయివేటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, విద్యార్థుల్లోనూ అదే వాణి. ఇందుకు కారణం లేకపోలేదు. 2007లో ఏర్పడిన పిడిఎఫ్ (ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్) ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగులకు ఇలా ఒకటేమిటి? అన్ని తరగతులకు సంబంధించిన సమస్యలపైనా పోరాడుతోంది. చివరికి పెట్టుబడుల భాగస్వామ్యం పేరుతో చేపడుతున్న ప్రభుత్వ రంగ సంస్థల విక్రయాలను కూడా చట్టసభల్లో కేవలం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే వ్యతిరేకిస్తున్నారు. మరో మాటలో చెప్పాలంటే రాష్ట్రంలో శాసన మండలిలోనూ, బయట పిడిఎఫ్ ఎమ్మెల్సీలే ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వీరంతా అధికార, ప్రధాన ప్రతిపక్షాలకు గుణపాఠం నేర్పేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయులు సిద్ధమౌతున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉపాధ్యాయులు, ఉద్యోగుల్లో అధిక శాతం మంది పట్టభద్రులే. వీరంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలకపాత్ర పోషించనున్నారు. వీరంతా బంధువులు, గురుశిష్య సంబంధాలు, మిత్ర బృందాలను కూడా ప్రభావితం చేయనున్నారు. ఈ నేపథ్యంలో వీరంతా ఎటువైపు ఉంటారన్న చర్చ జరగడం సర్వసాధారణం. కానీ, ఈసారి మాములుగా లేకుండా పిడిఎఫ్ బలపర్చిన అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ పట్టం కట్టేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా ఆమె జీవితం సామాజిక సేవతో పెనవేసుకుని ఉంది. సొంత లాభం కొంత మానుకుని పొరుగువారికి పాటుపడవోయ్.. అన్న మహాకవి గురజాడ అడుగుజాడల్లో మహిళలు, గిరిజనులు, మత్స్యకారులు, పేదల సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషిచేశారు. విద్యార్థులు, చిన్నారుల బంగారు భవిష్యత్తుకు తనవంతు సేవలందిస్తూ ఐందాతరాల్లో ఏర్పాటుచేసిన అనేక సదస్సుల్లో ప్రాతినిధ్యం వహించారు. ఆమె వ్యక్తిగత చరిష్మా సంగతి కాస్త అటుంచితే, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు బలపర్చిన అభ్యర్థికావడం అత్యంత కీలక అంశంగా చెప్పొచ్చు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అటు శాసన మండలిలోనూ, ఇటు ప్రజాక్షేత్రంలోనూ ఉద్యోగులు, ఉపాధ్యాయ సమస్యలపై తమదైన శైలిలో గళమెత్తుతూనే ఉన్నారు. ముఖ్యంగా పిఆర్‌సి విషయంలో జరిగిన మోసాన్ని తేటతెల్లం చేయడంలో పిడిఎఫ్‌దే కీలకపాత్ర. మరోవైపు సిపిఎస్ రద్దుకోసం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలంటూ ప్రభుత్వాన్ని గర్జించారు. ఈ సమస్య ప్రధాన ప్రతిపక్షమైన టిడిపికి పట్టకపోయినా, ఉద్యోగుల తరపున పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిలబడి పోరాడుతున్నారు. ప్రాథమిక విద్యావ్యవస్థను నాశనం చేయడంతోపాటు ఇటు ఉపాధ్యాయులకు అటు డి.ఎడ్, బిఇడి పూర్తిచేసి ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటమాడే నూతన విద్యావిధానాన్నీ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు వ్యతిరేకిస్తున్నారు. పిఆర్‌సి, సిపిఎస్, నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులపై ప్రభుత్వం అణచివేత చర్యలు తారా స్థాయికి చేరాయి. పిఆర్‌సి ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉపాధ్యాయ లోకంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. చలో విజయవాడ, కలెక్టరేట్ ఎదుట ధర్నాల సందర్భంగా ఉపాధ్యాయులను పోలీసులతో ప్రభుత్వం గృహ నిర్బంధాలకు గురిచేసింది. ఇప్పటికీ బెదిరింపులు, అదిరింపులు కొనసాగుతున్నాయి. వీటితోపాటు ప్రభుత్వం అనేక ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తుండడమే వారి మనోగతం. ఇటువంటి పరిస్థితుల్లో అధికార, ప్రతిపక్షాలు బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థులకన్నా తమ కోసం పోరాడే పిడిఎఫ్ బలపర్చిన రమాప్రభే మేలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఇలా ఒకటేమిటి చాలా మంది పట్టభద్రుల్లో చర్చసాగుతోంది.

ప్రయివేటు టీచర్లకు వెల్ఫేర్ బోర్డు

ఎన్నికల ప్రచారంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రయివేటు విద్యాసంస్థల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తానని ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ తెలిపారు. సోమవారం విజయనగరంలోని పలు విద్యాసంస్థల్లోని ఉద్యోగులు, ఉపాధ్యాయులను కలిసి మాట్లాడారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల తరపున శాసనమండలిలో పోరాడుతున్నది కేవలం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని చెప్పారు. అటువంటి ఫ్రంట్ తనను బలపర్చడం గర్వకారణమన్నారు. ఇప్పటి వరకు సామాజిక సమస్యలపై పోరాడానని, పట్టభద్రులు అవకాశం కల్పిస్తే చట్టసభలో ఉత్తరాంధ్ర అభివృద్ధి, ఇతర సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రయివేట్ విద్యాసంస్థల సిబ్బంది హక్కుల కోసం పనిచేస్తానని చెప్పారు. వారందరికీ గుర్తింపు కార్డుల మంజూరు కోసం కృషి చేస్తానన్నారు. ప్రజల గొంతుకనై పనిచేస్తానని, మొదటి ప్రాధాన్యత ఓటు వేసే గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వెంకటేష్, పి.రామ్మోహన్, నాయకులు పావని, రామకృష్ణ, లావణ్య, సంధ్య, బాలాజీ, సోమేశ్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



ప్రయివేటు ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

ఎమ్మెల్సీ బరిలో 37 మంది

- పట్టభద్రుల శాసన మండలి స్థానానికి ముగ్గురు నామినేషన్ల ఉపసంహరణ
- మొత్తం ఓట్లు 289214
- పోలింగ్ కేంద్రాలు 331
- మార్చి 13న పోలింగ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి పోటీలో 37 మంది అభ్యర్థులు ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వెల్లడించారు. తన కార్యాలయంలో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నియోజకవర్గానికి సంబంధించి పట్టబద్రుల శాసన మండలి ఎన్నికలపై ఆయన సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొడ్డేడ చంద్రకళ పద్మావతి, ఈర్ల శ్రీరామమూర్తి, గూణారు మళ్లనాయుడులు పోటీ నుంచి ఉప సంహరించుకున్నట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలు ఇలా..

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి 331 పోలింగు కేంద్రాలు ఉండగా శ్రీకాకుళం జిల్లాలో 59, విజయనగరంలో 72, పార్వతీపురం మన్యంలో 24, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 15, విశాఖపట్నంలో 112, అనకాపల్లిలో 49 పోలింగు కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. పోలింగు సిబ్బందికి ఈ నెల 28న, తిరిగి రెండో సారి మార్చి 7న శిక్షణ ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు బూత్ స్థాయి అధికారులతో ఓటరుకు స్లిప్పులు, ఓటరుకు సంబంధించిన సమాచారం అందిస్తారని, ఆబ్సెంటీ, షిఫ్టెడ్, డూప్లికేట్ ఓటరు జాబితాను ప్రెసైడింగ్ ఆఫీసర్లకు మెటీరియల్‌తో అందజేస్తామని తెలిపారు.

ఓటర్లు ఇలా..

ఉత్తరాంధ్ర పట్టభద్రులకు సంబంధించి 2,89,214 ఓట్లు ఉండగా శ్రీకాకుళం జిల్లాలో 52256 మంది, విజయనగరం జిల్లాలో 58502 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో 18520 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11525 మంది, విశాఖపట్నం జిల్లాలో 105697 మంది, అనకాపల్లి జిల్లాలో 42714 మంది ఉన్నట్లు పేర్కొన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

ఎన్నికలకు సంబంధించి విశాఖపట్నం జిల్లాలో 15 మంది సెక్టార్/జోనల్ ఆఫీసర్లు, 15 మంది రూటు ఆఫీసర్లు, 112 మంది బూత్ స్థాయి ఆఫీసర్లు, 143 మంది ప్రెసైడింగ్ ఆఫీసర్లు, 443 మంది ఇతర పోలింగ్ ఆఫీసర్లు, 112 మంది సూక్ష్మ పరిశీలకులు, 112 వెబ్ కాస్టింగ్ వెబ్ కెమెరాలు (అన్ని పోలింగు కేంద్రాలలో), ఒక మండలానికి 11 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆరు జిల్లాల్లో సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అభ్యర్థుల పేర్లు ఆల్ఫాబెటికల్ ఆర్డర్‌లో పెట్టి ఎన్నికల కమిషన్ పరిశీలనకు పంపించామన్నారు.

పోలింగ్ సమయం

పోలింగు మార్చి 13న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాగుతుందని, 4 గంటల తర్వాత వరుసలో ఉన్న వారిని వీడియో తీసి వారికి టోకెన్లు అందిస్తారని, వారు మాత్రమే ఓటు వేస్తారని తెలిపారు. పోలింగు పూర్తయిన తరువాత సంబంధిత స్ట్రాంగ్ రూంలలో భద్రపరుస్తారని, మరుసటి రోజున పోలీసు బందోబస్తుతో ఆయా జిల్లాల నుంచి తీసుకువచ్చి స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరుస్తారని తెలిపారు. మార్చి 16న స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపునకు 28 లెక్కింపు టేబుల్స్, ఒక రిటర్నింగ్ అధికారి టేబుల్ సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకే లెక్కింపు ప్రారంభమవుతుందని వివరించారు. వీడియోగ్రఫీ సమక్షంలో లెక్కింపు ప్రారంభమవుతుందని చెప్పారు. వివిధ పార్టీల అభ్యర్థులు, నాయకులు, స్వతంత్ర అభ్యర్థులు వ్యక్తిగత దూషణలకు పోరాదని అన్నారు. ఒక వ్యక్తి అనుమతి లేకుండా ఆయన ఇంటినిగానీ, ఇంటి ఆవరణాన్నిగానీ ఎన్నికల ప్రచారానికి ఉపయోగించరాదన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయరాదని తెలిపారు. పోలింగు కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో ప్రచారం నిషిద్ధమని, ఎన్నికల సమయానికి 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాలని అన్నారు. పోలింగు కేంద్రాలకు పోలింగు ఏజెంట్లుగా ఒకరిని మాత్రమే అనుమతిస్తామని తెలిపారు.

పోలీసు బందోబస్తు

నగర పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికలు, ఓట్ల లెక్కింపునకు సంబంధించి పూర్తి స్థాయి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 1162 మంది పోలీసులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. పోలింగు రోజున 840 మందిని వినియోగిస్తున్నట్లు వివరించారు. 112 పోలింగు స్టేషన్లు, 43 పోలింగు లొకేషన్లు, 15 రూటు మొబైల్స్, ప్రతి పోలింగు స్టేషన్ వద్ద అక్కడ ఉన్న సమస్యల ఆధారంగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సెస్, స్ట్రైకింగ్ ఫోర్సెస్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లా రిజర్వ్ ఫోర్స్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. ఎన్నికలు పూర్తయిన తరువాత స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం వద్ద, స్ట్రాంగ్ రూం వద్ద సెంట్రల్ పారామిలటరీ ఫోర్స్‌తో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. లెక్కింపు రోజున పారామిలటరీ దళాలను అందుబాటులో ఉంచుతామన్నారు. తొలుత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళిని తెలియజేశారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన అభ్యర్థులు, నాయకులు, స్వతంత్ర అభ్యర్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాలను సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని బిపిఎం మున్సిపల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి సోమవారం సందర్శించారు. ఆ పాఠశాల నుంచి చిట్టి గురువులు కార్యక్రమంలో చురుకైన పాత్ర పోషించిన, ఇటీవల పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అద్భుత సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన 27 మంది విద్యార్థులకు, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు కలెక్టర్ జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న సఖి శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. శిక్షణలో చెబుతున్న అంశాలపై విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. ఇక్కడ అందించిన సూచనలను తప్పకుండా పాటించాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ సూచించారు. నవరత్నాలులో భాగంగా విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌ల పనితీరును కలెక్టర్ పరిశీలించారు. వాటి వినియోగం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక సాంకేతిక ప్రదర్శనను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో అడల్ట్ ఎడ్యుకేషన్ డిడి సుగుణాకర్‌రావు, సచివాలయాల ప్రతినిధి హరీష్, బిపిఎం పాఠశాల హెచ్ఎం విశాలాక్షి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ట్యాబ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

క్వారీ కార్మికులకు వేతన సవరణ చేయాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని • ఎస్.కోటలో నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఏళ్ల తరబడి క్వారీలను నమ్ముకుని బతుకుతున్న కార్మికులకు పెరుగుతున్న ధరల కనుగుణంగా వేతన సవరణ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ క్వారీ యాజమాన్యాలను డిమాండ్ చేశారు. మండలంలోని వెంకటరమణపేట పరిధిలోని నాలుగు క్వారీలలో పనిచేస్తున్న కార్మికులు నూతన వేతన ఒప్పందం చేయాలని సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి దేవి కూడలి మీదుగా తహశీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకొన్నారు. తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తమ్మినేని మాట్లాడుతూ జనవరిలో కార్మికుల పాత వేతన ఒప్పందం ముగిసిందన్నారు. అదే నెల నుంచి నూతన వేతన ఒప్పందం చేయాల్సి ఉన్నా క్వారీ యాజమాన్యాలు స్పందించకపోవడంతో ఈ నెల 21 నుంచి నాలుగు క్వారీల పరిధిలోని కార్మికులు సమ్మె చేస్తున్నారని తెలిపారు. క్వారీ యాజమాన్యాలు అనేక రూపాల్లో కోట్ల రూపాయల లాభాలు ఆర్జిస్తున్నా, కార్మికుల బతుకులు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. నూతన వేతన సవరణలో భాగంగా ఉన్న జీతంపై రూ.4 వేలు పెంచాలని, ప్రస్తుతం ఇస్తున్న రూ.200 బేటాకు అదనంగా రూ.100 కలిపి ఇవ్వాలని డిమాండ్‌చేశారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని, విశ్రాంతి గృహాలు నిర్మించాలని కోరారు. ప్రథమ చికిత్స కిట్లను, అత్యవసర వాహనాన్ని అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. వీటిపై పది రోజుల క్రితం క్వారీ యాజమాన్యాలతో చర్చలు జరపగా, ఏడాది పాటు సమయం కావాలనడం సరైన పద్ధతి కాదన్నారు. క్వారీలను నమ్ముకుని కార్మికులు బతుకుతున్నారని, ప్రతి రెండేళ్లకు ఒకసారి నూతన వేతన ఒప్పందాన్ని అమలు చేయాలని సమ్మె చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కార్మికుల సమస్యల పరిష్కారానికి క్వారీ యాజమాన్యాలతో మాట్లాడాలని కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించుకుంటే ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో క్వారీ యూనియన్ నాయకులు యర్రా ప్రగడ భాస్కరరావు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చెలికాని ముత్యాలు, క్వారీ కార్మికులు పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న క్వారీ కార్మికులు, సిఐటియు నాయకులు

మినుముల కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో రబీలో సాగుచేసిన మినుములు, పెసలు కొనుగోలు చేస్తున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ విమల తెలిపారు. క్వింటా మినుములు రూ.6600, పెసలు రూ.7755 చొప్పున ప్రభుత్వం మద్దతుధర నిర్ణయించినట్లు చెప్పారు. ఇ-క్రాప్ నమోదై, సిఎం యాప్‌లో నమోదు చేయించుకున్న వారి నుంచి మాత్రమే కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. గంట్యాడ మండలంలో వసాది ఆర్‌బికెలో సోమవారం అధికారులు కొనుగోలు ప్రక్రియను ప్రారంభించారు. జిల్లాలో అన్ని మండలాల్లో ఆర్‌బికెల్లో ప్రారంభిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రతి రైతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు సైన్స్ ఫెస్ట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పల్లవి విద్యా మందిర్ పాఠశాలలో మంగళవారం సైన్స్ ఫెస్ట్ ఏర్పాటు చేసినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఎస్.శేఖర్, ప్రిన్సిపల్ డి.వెంకటలక్ష్మి తెలిపారు. సోమవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థులు తయారు చేసిన 140 ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. వీటితో పాటు స్పెషల్ ఈవెంట్స్ ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను పెంపొందించడం కోసం ఫెస్ట్‌ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర చాలా కీలకమని, ప్రతి అంశాన్నీ సునిశితంగా పరిశీలించాల్సిన బాధ్యత వారిపై ఉందని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి పేర్కొన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో వారు ప్రధాన భూమిక పోషించాలన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నియమించిన విజయనగరం, శ్రీకాకుళం సూక్ష్మ పరిశీలకులకు కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ప్రత్యేక అవగాహన శిబిరం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన నియమావళి, అనుసరించాల్సిన నిబంధనలు, నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి సూక్ష్మ పరిశీలకులకు కలెక్టర్ అవగాహన కల్పించారు. కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించిన నియమావళిని ప్రతిఒక్కరూ తు.చ తప్పకుండా అమలు చేయాలన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో జరిగే ప్రతి అంశంపైనా సూక్ష్మ పరిశీలకులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సొంత నిర్ణయాలు సరికావని, ఎన్నికల సంఘం రూపొందించిన నియమావళిని పాటించాలన్నారు. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి విషయాన్నీ ఎన్నికల పరిశీలకులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే ఎన్నికల సరళి, ఇతర అంశాలపై నివేదిక అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

కళ్లూ.. చెవులు లాంటి వారు

సూక్ష్మ పరిశీలకులు ఎన్నికల సంఘానికి కళ్లు, చెవులు లాంటి వారని ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ జైన్ అభిప్రాయపడ్డారు. శిక్షణ శిబిరంలో భాగంగా ఆయన వర్చ్యువల్ విధానంలో మాట్లాడారు. ప్రతి దశలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా సమస్య తలెత్తితే సంబంధిత ఉన్నత స్థాయి అధికారులకు గానీ, లేదా తనకి తెలియజేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో జరిగే అంశాలపై తనకు సమాచారం అందించవచ్చని సూచిస్తూ ఈ సందర్భంగా సిద్ధార్థ్ జైన్ తన ఫోన్ నంబర్‌ను పరిశీలకులకు అందజేశారు. శిబిరంలో డిఆర్ఒ ఎం.గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మలత, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రజారోగ్య శాఖ ఎస్ఇ రాజారావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని నగరంలో ప్రజలకు ఎటువంటి నీటి ఇబ్బందులు లేకుండా చేయాలని ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రజారోగ్యశాఖ ఎస్ఇ కె.రాజారావు తెలిపారు. సోమవారం ముషిడిపల్లి, రామతీర్థం, నెల్లిమర్ల పంపుహౌస్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న వేసవిలో ప్రస్తుతం ఇస్తున్న నీటి శాతం తగ్గకుండా ఉండేలా ఎక్కడికక్కడ నీటి నిల్వ, క్రాస్‌బాండ్లు అవసరమని గుర్తించి, అందుకు తగ్గట్టు యాక్షన్ ప్లాన్ రూపొందించినట్లు చెప్పారు. ముషిడిపల్లి, నెల్లిమర్ల ప్రాజెక్టుల వద్ద క్రాస్‌బాండ్లు అవసరమని గుర్తించామన్నారు. వాటి పనులు వారం రోజుల్లో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. నెల్లిమర్ల వద్ద ఉన్న నీటి నిల్వ మార్చి 20 తేదీ వరకు సరిపడుతుందని, తర్వాత ఆంధ్ర నుంచి నీటిని తెప్పించే ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. నీటి డైవర్షన్ కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగర ప్రజలకు వేసవిలో నీటి ఇబ్బంది లేకుండా అదనంగా మరో 5 ఎంఎల్‌డి నీరు అందుబాటులో ఉండేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు, డిఇ అప్పారావు పాల్గొన్నారు.



నెల్లిమర్ల వద్ద నీటి నిల్వలను పరిశీలిస్తున్న ఎస్ఇ రాజారావు



నేహాను సత్కరిస్తున్న కమాండర్ సిఎండిఇ అరవింద్

నేహాకు సత్కారం

ప్రజాశక్తి-విజయనగరం

సీతం కళాశాల విద్యార్థి, ఎన్‌సిసి క్యాడెట్ అన్నా నేహా థామస్‌ను సోమవారం విశాఖలోని ఎన్‌సిసి గ్రూపు ప్రధాన కార్యాలయంలో కమాండర్ సిఎండిఇ అరవింద్ నగర్ సత్కరించారు. ఇటీవల నేహా డిజిఎన్‌సిసి నుంచి కమాండేషన్ కార్డు సాధించారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ ఈ అవార్డు కోసం దేశ వ్యాప్తంగా 15 లక్షల మంది పోటీ పడగా పది మందికి ఇచ్చారని, అందులో నేహా థామస్ ఒకరని తెలిపారు. తెలుగు రాష్ట్రం నుండి నేహా థామస్‌కు ఈ అవార్డు రావడం అభినందనీయమన్నారు. విద్యార్థులంతా నేహాను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సిసి విజయనగరం కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎ.కె.నౌతియాల్, ఎఒ మేజర్ శివాలి, సీతం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి.రామ్మూర్తి , కెప్టెన్ ఎం.సత్యవేణి, లెఫ్టినెంట్ ఎం.వరలక్ష్మి, నేహా థామస్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే సమాజాభివృద్ధి

ప్రజాశక్తి- బొబ్బిలి

సైన్స్‌తో సమాజం అభివృద్ధి సాధించవచ్చునని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన అన్నారు. శ్వేతాచలపతి సంస్థానం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ప్రదర్శనను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ పై విద్యార్థులు ఆసక్తి కనబరచాలని కోరారు. సైన్స్ పై పట్టు సాధిస్తే భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగడానికి దోహదం పడుతోందన్నారు. ప్రీప్రైమరీ స్కూల్ డైరెక్టర్ నిక్కీ శామ్యూల్ మాట్లాడుతూ ఇంగ్లాండ్‌లో జరిగిన సైన్స్ ప్రదర్శనకు సమానంగా విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శనకు పెట్టారన్నారు. రెండోరోజు సైన్స్ ప్రదర్శన తిలకించేందుకు అధిక సంఖ్యలో జనం చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫ్రాన్సిస్ జార్జ్, సిబ్బంది పాల్గొన్నారు.


బొబ్బిలి : సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న బేబినాయన

బొబ్బిలిరూరల్: బాల్య దశలోనే విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని నారాయణప్ప వలస పాఠశాల ప్రధానోపాధ్యాయులు, రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు అన్నారు. సోమవారం పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని సైన్స్ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో దేశాల ఆర్థిక, సామాజిక, పారిశ్రామిక అభివృద్ధి అనేది ఆదేశ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో మాత్రమే కొలవబడుతుందన్నారు. విజ్ఞాన శాస్త్రం మానవ జీవితం తో విడదీయరానిదని అన్నారు. విద్యార్థులు విజ్ఞాన శాస్త్రం పట్ల ఇష్టాన్ని, దృక్పథాన్ని పెంపొందించుకోవాలని కోరారు. సివి రామన్ జీవిత విశేషాలను, ఆయన కనుగొన్న రామన్ ఎఫెక్టును సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు వివరించారు. అనంతరం విద్యార్థులు చేసిన కిడ్నీ, ఊపిరి తిత్తులు, డ్రిప్ ఇరిగేషన్, స్వచ్ఛ గ్రామం గాలి కలుషితం, మానవ జీర్ణ వ్యవస్థ మొదలైన వివిధ సైన్స్ వర్కింగ్ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళి, భానుప్రకాష్, రామచంద్రరావు, మహేష్‌లు పాల్గొన్నారు.

రాజాం: స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో సర్ సివి రామన్ జయంతిని పురస్కరించుకొని సైన్స్ దినోత్సవ వేడుకలలో భాగంగా సోమవారం సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ


రాజాం: సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న కమిషనర్ కృష్ణారావు

కార్యక్రమంలో రాజాం పట్టణ మున్సిపల్ కమీషనర్ కృష్ణారావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విజయనగరం, పార్వతీపురం జిల్లాల రీజనల్ అధికారి వి. శ్రీనివాస్ మాట్లాడుతూ సైన్స్ ఎక్స్‌పో వెనుక విద్యార్థుల, ఉపాధ్యాయుల కృషి ఉందన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ముందు ఉండాలంటే ఇన్నోవేటివ్ స్కిల్స్‌ను కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులు చూపరులను ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో అకడమిక్ కో ఆర్డినేటర్ బాలరాజు, డీన్లు హరి, శ్రీనివాస్, సురేంద్ర, వైస్ ప్రిన్సిపల్ మాలతీ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

'ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోండి'


టైల్స్ బాక్సులను మోసుకెళ్తున్న విద్యార్థులు

పూసపాటిరేగ: మండలంలోని కొత్త కొప్పెర్ల పంచాయతీలోని మత్సవాని పాలెం ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులతో టైల్స్ మోయిస్తున్న ఉపాధ్యాయుడు పై వెంటనే చర్యలు తీసుకోవాలని చైల్డ్‌రైట్స్ ఫారం కోరింది. మత్సవాని పాలెం ప్రధానోపాధ్యా యులుగా పెంకి శ్రీనివాసరావు పనిచేస్తున్నారు. నాడు నేడు పనుల్లో భాగంగా సోమవారం పాఠశాలకు ఆటో పై టైల్స్ వచ్చాయి. టైల్స్‌ని విద్యార్థులతో మోయిస్తున్నారంటూ అక్కడ స్థానికులు ఫోటోలు తీసి మీడియాలో ప్రచారం చేశారు. ఈ విషయమై హెచ్‌ఎం శ్రీనివాసరావుతో మాట్లాడగా రెండు ఆటోలపై నాడు నేడు పనుల్లో భాగంగా పాఠశాలకు టైల్స్ వచ్చాయని తెలిపారు. అయితే టైల్స్ పాఠశాలలో పెట్టేందుకు కూలీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టైల్స్ అన్ని పాఠశాల చేర్చిన తర్వాత దూరంగా నాలుగు ప్యాకెట్లు మిగిలిపోగా నాకు తెలియకుండా విద్యార్థులు మోసుకు రావడంతో ఇలా జరిగిందని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులతో ఎటువంటి బరువులు మోహించడం లేదని తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


విజేతకు ప్రశంస పత్రాన్ని అందిస్తున్న నిర్వాహకులు

మెంటాడ : 'విద్యలో మానవతా విలువలు ఎలా ఉపయోగపడతాయి' అనే అంశంపై మెంటాడ వారియర్స్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గుర్ల ప్రాథమిక పాఠశాల, ఆంధ్ర ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఈ వ్యాసరచన పోటీల్లో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొని పోటీ పడ్డారు. ఇందులో గెలిపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గుర్ల సర్పంచ్ బొద్దల సత్యవతి, స్కూల్ చైర్‌పర్సన్ గంగ్రేటి అనురాధ పిల్లలను అభినందించారు.

పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ


బొబ్బిలి : నేను సైతం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం శివాలయం వద్ద పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. పేదల ఆకలి తీర్చేందుకు 280 వారాలు నుంచి ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు బి.సంతోష్, ఎల్.వాసు తెలిపారు.

శాశ్వత భూ హక్కుతో ప్రయోజనాలు

బొబ్బిలిరూరల్ : జగనన్న భూ హక్కుతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలగనున్నాయని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అన్నారు. సోమవారం ఎ. వెలగవలసలో జగనన్న శాశ్వత భుహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా గ్రామ రెవెన్యూలో భూ-రీసర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలకు వివాదాలు లేని ఆస్థి హక్కు కల్పించడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇందులో భాగంగా అధునాతన పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూ రీ సర్వే చేయడం జరుగుతుందన్నారు. దళారి వ్యవస్థకు స్వస్తి పలుకుతూ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, అవినీతికి తావులేకుండా భూ సర్వే చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మొట్ట మొదటిసారిగా మన రాష్ట్రంలో అధునాతన టెక్నాలజీ వినియోగించి సర్వే చేపట్టడంతో భూ సర్వేలో అవకతవకలు జరగవని దీనికి రైతులు సహకరించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం

వంగర: మండలంలోని అరసాడ, కొప్పర వలస, వంగర, కింజంగి లోని ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక సచివాలయంలో గల ఆధార్ కేంద్రాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై అక్కడ సచివాలయ ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆధార్ కేంద్రాలలో ఆధార్ కార్డు అప్డేట్‌తో పాటు, పేరు, చిరునామా, పుట్టిన తేదీ, ఫోటో సరి చేయడం, చిన్న పిల్లలకు ఆధార్ కార్డులు చేయడం జరుగుతుందని దగ్గరలో గల ఆధార్ కేంద్రానికి వెళ్లి ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.


ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

సఖీ సభ్యులతో ఎంపిడిఒ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

వేపాడ : స్థానిక మండల పరిషత్తు కార్యాల యంలో సోమవారం ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ సోమవారం సఖీ సభ్యు లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో సఖి గ్రూప్ సభ్యులు చేపట్టవలసిన కార్యక్రమాల గురించి సభ్యులకు క్లుప్తంగా వివరించారు. గ్రామాలలో ప్రశాంత వాతావరణం ఏర్పడడానికి గ్రూపు సభ్యులందరూ గ్రామ ప్రజలకు సేవలు అందించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి సూర్యనారాయణ, మండల పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎండిఎం ఆలీ, ఏపిఎంఆర్ శ్రీనివాసరావు, ఎపిఒ సన్యాసిరావు, వేపాడ పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమావేశం

వేపాడ : మండలంలోని సోంపురం సచివాలయం, జగ్గయ్యపేట గ్రామపంచాయతీ కార్యాలయంలోనూ ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ సోమవారం సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీలకు వచ్చే ఆదాయం పై వివరించారు. ఆధార్ అప్‌లోడ్ విధానం గురించి చెప్పారు. అనంతరం జగ్గయ్యపేట గ్రామంలో చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగమణి, జగ్గయ్యపేట ఉప సర్పంచ్ వంటాకు శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి పాలనపై ప్రజల్లో అసంతృప్తి


పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోండ్రు మురళీ

రేగిడి : వైసిపి నియంత పాలనపై ప్రజలు విసిగి చెందారని 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెబుతారని మాజీ మంత్రి, టిడిపి నియోజకవర్గ ఇంచార్జి కోండ్రు మురళీ మోహన్ అన్నారు. సోమరాజుపేట గ్రామంలో సోమవారం సాయంత్రం కోండ్రు మురళి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ బూడి ఆదినారాయణ, వైస్ సర్పంచ్ సుంకరి హరికృష్ణ, మాజీ డీలర్ సుంకరి అప్పలనాయుడు, కె.తవిటినాయుడి, డి.ప్రకాశరావు, బి. సత్యం నాయుడు తదితర గ్రామ పెద్దల ఆధ్వర్యంలో 200 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వీరిని పార్టీ కండువాలు వేసి మాజీ మంత్రి సాధారంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామాభివృద్ధికి కేంద్రం కేటాయించిన నిధులను దారి మళ్లించడంతో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండలం టిడిపి అధ్యక్షులు కిమిడి అశోక్ కుమార్, బాలి రామినాయుడు, నియోజక వర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'సెంచూరియన్'లో నాణ్యమైన విద్య

ప్రజాశక్తి- నెల్లిమర్ల

రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందించడం తోపాటు ఉపాధి అవకాశాలు కల్పించడంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం ముందంజలో ఉందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. సోమవారం విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసిన 'గజజ్యోతి' అనే సాంకేతిక, సాంస్కృతిక వేడుకలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసి వందలాది మంది విద్యార్థులకు చదువుతోపాటు ఉపాధి అవకాశాలను కల్పిస్తొన్న ఈ విశ్వ విద్యాలయం మన జిల్లాలో ఉండటం మనకు గర్వకారణమన్నారు. మరోపక్క విశ్వ విద్యాలయంలో విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు నాంది పలకడం అభినందించ దగ్గ విషయమన్నారు. వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డి.ఎన్.రావు మాట్లాడుతూ అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్‌ఎన్ రాజు మాట్లాడుతూ పరిశోధన, నూతన ఆవిష్కరణలలో విశ్వవిద్యాలయం ముందంజలో ఉందన్నారు. విద్యార్థులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన ఇ-రిక్షా, వాటర్ మేనేజ్మెంట్, త్రీడి టెక్నాలజీతో తయారు చేసిన నమూనాలు, ఆప్టికల్స్, విడి భాగాలు తదితర వాటిని డిప్యూటీ స్పీకర్ తిలకించారు. 95 ఏళ్ల వయస్సులో రిటైర్డ్ ప్రొఫెసర్ శాంతమ్మ విద్యను బోధించడం పట్ల ఆమెను అభినందించారు. ఈ వేడుకలలో భాగంగా పులి వేషాలు, తప్పెటగుళ్ళు, నంది అవార్డు గ్రహీత తిరుపతినాయుడు పద్యపఠనం, టెక్నో మేనేజ్మెంట్, ఫ్లాష్ మాబ్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధి ఎస్.రవీంద్ర, ప్రొఫెసర్ కృష్ణమూర్తి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్‌ఎస్ వర్మ, డాక్టర్ ఎంఎల్‌ఎన్ ఆచారి, డాక్టర్ సన్నీడియోల్, డాక్టర్ మురళీ, డాక్టర్ పుష్పలత, డాక్టర్ సతీష్, డాక్టర్ దిలీప్ కుమార్, ప్రీత, తదితర అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల


విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

నేడు యల్లమ్మ జాతర



ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని పల్లిగండ్రేడు గ్రామంలో వెలసిన యల్లమ్మ తల్లి జాతరను మంగళవారం నిర్వహించనున్నారు. జామి వారి ఇంట వెలసిన యల్లమ్మని పూజారి ఊర్లపు రామారావు(రాము) సిరిమానును అధిరోహించి భక్తులకు ఆశీర్వాదం అందచేస్తారు. ఒక్క రోజు జరిగే ఈ యాత్రకు సుమారు చుట్టుపక్కల ఇరవై గ్రామాల నుండి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ఇందులో భాగంగా మంగళవారం మధ్యాహ్నం గ్రామ పురవీధుల నుండి రథం అమ్మవారి గుడికి చేరుకొంటుంది.

గ్రామ వాలంటీర్లదే హవా!


గొంప వెంకటరావు

ప్రజాశక్తి- వేపాడ

గ్రామాల్లో గ్రామ వాలంటీర్లదే హవా అని సర్పంచులు, ఎంపిటిసిలు నామ మాత్రమేనని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు ఎద్దేవా చేశారు ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా రాజ్యాంగంలో పొంది పరిచిన హక్కులను ఈ ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల తరుపున పోరాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థికే పట్టభద్రుల ఓటువేయాలని ఆయన కోరారు.

'అవంతి'లో నేడు జాబ్‌మేళా

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని బసవపాలెంలో ఉన్న అవంతి ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అవంతి విద్యా సంస్థలు చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 16 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొంటారన్నారు. డిగ్రీ, పీజీ, బిఇ, బిటెక్, ఐటి, ఎంసిఎ చేసిన వారంతా అర్హులన్నారు. ఆ సక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ మేళాలో ఎంపికైన వారికి గౌరవ ప్రదవమైన జీతం ఉంటుందని స్పష్టం చేశారు.

రోడ్డు విస్తరణతో రైతులకు నష్టం

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ గ్రామం మీదుగా సోంపురం జంక్షన్ నుండి ఆనందపురం జంక్షన్ వరకు సుమారు 19 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులకు ప్రభుత్వం రూ.39 కోట్లు మంజూరు చేసింది. ఈ విస్తరణ పనుల వల్ల సోంపురం జంక్షన్ నుండి ఆనందపురం జంక్షన్ వరకు సుమారు 25 కల్వర్టులు ఏర్పాటు చేయాల్సి ఉంది. గుత్తేదారుడు పాత కల్వర్టుల స్థానంలోనే రోడ్డును తవ్వి పాత గొట్టాలు తొలగించి వాటి స్థానంలోనే కొత్త సిమెంట్ గొట్టాలని ఏర్పాటు చేసి పైన కాంక్రీట్ వేసి మూసి వేస్తున్నారు. ఈ విధానం వల్ల నీలకంఠ రాజపుర అగ్రహారం, భరతవానిపాలెం, వేపాడ, వల్లంపూడి, ఆకుల సీతంపేట, జగ్గయ్యపేట, అరిగిపాలెం గ్రామాలకు చెందిన చెరువులలో నీరు నిల్వ ఉండకుండా ఆ కల్వర్టులు గుండా పోయే ప్రమాదం ఉంది. గతంలో కల్వర్టుల వద్ద నీరు వృధాగా పోకుండా తగు ఏర్పాట్లు ఉండేవి. ఇప్పుడు అవి ఏవి లేకుండా కల్వర్టులు నిర్మాణం చేయడం వల్ల రైతులకు సాగునీరు దక్కే అవకాశం లేదని వాపోతున్నారు. ఈ విషయంపై కాంట్రాక్టర్‌ను వివరణ కోరగా తమకు ఇచ్చిన ఎస్టిమేషన్‌లో సిమెంటు గొట్టాలు మాత్రమే ఏర్పాటు చేయాలని ఉందని మిగతా పనులు తాను చేయడానికి అవకాశం లేదని తేల్చిచెప్పారు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి రైతులు పంట సాగుకు నీరు నిల్వ ఉండే విధంగా తగు చర్యలు చేపట్టాలని రైతులు కోరతున్నారు.


నూతనంగా అమర్చిన గొట్టాలు

యల్లారమ్మ జాతరకు పోటెత్తిన జనం

ప్రజాశక్తి - జామి

మండల కేంద్రంలో యల్లారమ్మ తీర్థం ఘనంగా జరిగింది. ఉత్తరాంధ్ర మూడు జిల్లాలతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు జాతరకు తరలివచ్చారు. దీంతో ఈ ఏడాది జాతరకు లక్షలాది మంది జనం పోటెత్తారు. సోమవారం తెల్లవారు జాము నుంచి అమ్మవారికి భక్తులు ముడుపులు చెల్లించారు. వాస్తవానికి గ్రామ దేవతల పండుగలకు భిన్నంగా యల్లారమ్మ పండుగ నిర్వహిస్తారు. జంతు బలులు లేకుండా సాంప్రదాయ పద్ధతిలో నమ్ముకున్న దేవతకు ముడుపులు చెల్లించడం ప్రత్యేకత. ఈ సంధ్భంగా జరిగే జాతరకు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం కిలో మీటరు పైన బొమ్మల కొలువులు, రంగుల రాట్నం వంటి అనేక పిల్లల్ని ఆకర్షించే సర్కస్ వంటివి తీర్థంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ నేపథ్యంలో జాతర రెండు రోజులు రూ.కోట్లాది వ్యాపారం జరిగింది. సందర్శకులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరకుండా అధికార వర్గాలు, పోలీసులు చర్యలు చేపట్టారు. జామి పిహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.


జామి జాతరలో జన సందోహం

నేడు చిన్న తీర్థం

మూడు రోజులు యాల్లారమ్మ జాతరలో బాగంగా మంగళవారం చిన్నతీర్థం జరగనుంది. మూడు రోజులు పండుగ నేపథ్యంలో బంధువులు, స్నేహితులకు సపర్యలు చేసి అలసిపోయిన గ్రామస్థులకు ఉపశమనంగా గ్రామంలోని కొత్తలివారి కోవిల వద్ద తీర్థం ఏర్పాటు చేస్తారు. దీన్ని దమ్మిడీ తీర్థంగా కూడా పిలుస్తారు.

సామాజిక తనిఖీపై శిక్షణ

ప్రజాశక్తి- మెంటాడ

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి 16వ విడత సామాజిక తనిఖీపై ఎపిఒ చిన్నప్పయ్య అధ్యక్షతన ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, డిఆర్‌పిలకు ఉపాధి కార్యాలయంలో సోమవారం శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ పాండ్రంకి త్రివిక్రమరావు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి 100 రోజులు పని దినాలు కల్పించామన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్న కారణంగా సామాజిక తనిఖీ కేవలం అధికారుల ద్వారానే నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం నుంచి 31 గ్రామపంచాయతీలు, వాటి శివారు గ్రామాల్లో ఉపాధి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయితీ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లును సమన్వయం చేసుకొని డిఆర్‌పిలు తనిఖీలు నిర్వహించాలని ఆయన అన్నారు. ఎస్‌ఆర్‌పి అప్పలనాయుడు మాట్లాడుతూ 2021 ఏప్రిల్ ఒకటి నుంచి 2022 మార్చి 31 వరకు గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులు, మెటీరియల్ పనులు, ఉపాధి నిధుల ద్వారా నిర్మించిన పాఠశాలల ప్రహరీ గోడలుకు సంబంధించి రికార్డులను పరిశీలిస్తామన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ త్రివిక్రమరావు

అనధికారిక కట్టడాలను అరికట్టాలి

ప్రజాశక్తి - గుర్ల

మండలంలో గొర్లెపేట జగన్నాధపురంలో సర్వే నంబర్ 1-1 లోని ప్రభుత్వ భూమిలో ఉన్న కాలువ పై గూడెం గ్రామానికి చెందిన వ్యక్తి అనధికారికంగా శాశ్వత నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించడంతో పాటు అనధికారిక శాశ్వత నిర్మాణం చేపట్టడంతో సంబంధిత రెవెన్యూ అధికారులు ఆక్రమణదారునికి హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ సదరు వ్యక్తులు రెవెన్యూ అధికారుల హెచ్చరికలు బేఖాతరు చేసి రాత్రిపూట, సెలవు దినాల్లో నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ విషయంపై ఇటీవల కలెక్టరు గ్రీవెన్సులో కూడా గ్రామస్తులు ఫిర్యాదు చేవారు. అయినా సదరు కబ్జాదారు దర్జాగా నిర్మాణం చేపడుతున్నారు. సాగునీటి సరఫరా చేసే కాలువపై నిర్మాణం చేపట్టడం వల్ల సకాలంలో పొలాలకు సాగునీరందదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత కట్టడాలను అరికట్టి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


అక్రమంగా నిర్మిస్తున్న కట్టడం

చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ భూమిని ఆక్రమించి, అనధికారిక నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం. నిర్మాణాలు నిలుపుదల చేయాలని సంబంధిత విఆర్‌ఒను ఆదేశించామం. అప్పటికీ వినకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం

వి.పద్మావతి, తహాశీల్దార్ గుర్ల

ప్రారంభానికి నోచుకోని ఆర్‌బికెలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలో రైతులకు అనుకూలంగా రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం నిర్మించింది. అయితే చాలా భవనాలు నిర్మాణాలు పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. దీనికి ప్రధాన కారణం బిల్లులు కాకపోవడమనే తెలిస్తోంది. కొన్ని చోట్ల భవనాలు పూర్తయినప్పటికీ కిటికీలు, గచ్చులు చేయడానికి నిధులు లేక నిలిచిపోయాయి. జాకేరు సర్పంచ్ బుద్ధ చిన్నమ్ములు అప్పు చేసి గ్రామంలో ఆర్‌బికెను నిర్మించారు. ఇప్పటికీ బిల్లులు కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి బిల్లులు మంజూరు చేస్తే పూర్తి స్థాయిలో నిర్మాణాలు జరిగి ఆర్‌బికెలు రైతులకు అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి.


సోంపురంలో ప్రారంబానికి నోచుకుని ఆర్‌బికె

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘన నివాళి



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపల్

శృంగవరపుకోట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర శాఖ ఆధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్‌కు సోమవారం ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం. రమేష్ కుమార్ మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆజాద్ గొప్ప విప్లకారుడని చిన్న వయసులోనే ఉద్యమాలు బాట నడిపి నటువంటి వ్యక్తిగా అతని జీవిత చరిత్రను వివరించారు. చరిత్ర ఉపన్యాసకులు చల్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబంలో పండిత సీతారామ అగరాన దేవికి చంద్రశేఖర్ జన్మించారని గుర్తు చేశారు. అధ్యాపకులు జి ఈరన్న మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆజాద్ ధైర్య సాహసాలకు మారుపేరని, కేవలం 25 సంవత్సరాల లోపు భరతమాత ఒడిలో ఒరిగినటువంటి గొప్ప విప్ల వీరుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కే వాసుదేవరావ్ను, రవీంద్రనాథ్, భాస్కర్, శ్రీలక్ష్మి, వలికన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికలకు 13 పోలింగ్ కేంద్రాలు

ప్రజాశక్తి- బొబ్బిలి

రెవెన్యూ డివి జన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలకు 13 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆర్‌డిఒ పి.శేషశైలజ చెప్పారు. తన కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్‌లో ఏడు మండలాల్లో 13 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మూడు రూట్లను ఏర్పాటు చేశామని చెప్పారు. బొబ్బిలి, రామభద్రపురం మండలాలను ఒక రూటుగా, తెర్లాం, బాడంగి ఒక రూటుగా, గజపతినగరం, మెంటాడ, బొండపల్లి ఒక రూటుగా ఏర్పాటు చేశామని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు.


ఆర్‌డిఒ శేష శైలజ